## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరా నిలిపివేత

**హన్మకొండ:** విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా బుధవారం కాజీపేట దర్గా ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి

**విద్యారణ్యపురి :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లను తొలగించటం సరికాదని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి భాషబోయిన వేణురాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని డీఐఈఓ గోపాల్‌కు వినతిపత్రంను సమర్పించారు. డీఐఈఓను కలిసిన వారిలో పీడీఎస్‌యూ బాధ్యులు సాయి, గౌతమ్, హరి ఉన్నారు.

### 'గృహలక్ష్మి'ని సద్వినియోగం చేసుకోవాలి

**కాజీపేట అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గృహలక్ష్మి పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి తహసీల్దార్ బావ్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంతో పాటు మున్సిపల్ కార్యాలయంలోనూ స్వీకరిస్తున్నారని, ఈనెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### కాజీపేటను డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి

**కాజీపేట :** కాజీపేట రైల్వే జంక్షన్ ప్రాంతాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వెంటనే డివిజన్ కేంద్రంగా ప్రకటించి చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం పీఎం నరేంద్ర మోదీకి రాసిన బహిరంగ లేఖను పత్రికలకు విడుదల చేశారు. డివిజన్ కేంద్రంగా ప్రకటించేంత వరకు పార్టీలకతీతంగా ఉద్యమాలు కొనసాగిస్తామని ప్రకటించారు.

### కాలభైరవుడికి పూజలు

**కాశిబుగ్గ :** స్థానిక కాశీవిశ్వేశ్వరాలయంలోని కాలభైరవుడికి మంగళవారం అధిక శ్రావణమాసం బహుళ అష్టమిని పురస్కరించుకుని అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భైరవుడిని పూజిస్తే సకల గ్రహదోషాలు, అపమృత్యు దోషాలు తొలగి ఆయురారోగ్యాలు పొందుతారని మంత్రశాస్త్ర గ్రంథాలు చెపుతున్నాయని డాక్టర్ గోనె జగదీశ్వర్ తెలిపారు.

### రిజర్వేషన్ కల్పించాలి

**హన్మకొండ:** జనాభాలో 55 శాతానికి పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతిలో జరిగిన ఓబీసీ జాతీయ మహాసభలో చేసిన ప్రసంగాన్ని మంగళవారం పత్రిక ప్రకటనలో వివరించారు. దేశంలో ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు.

### తోళ్ల కార్మికులకు న్యాయం చేయండి

**వరంగల్:** నగరంలోని ఏనుమాముల శివారులోని తోళ్ల ఖార్ఖానాలో పనిచేస్తున్న కార్మికులకు లేబర్, పీఎఫ్ అధికారులు న్యాయం చేయాలని ట్యానరీ లెదర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొత్తూరి యాకేందర్ అన్నారు. మంగళవారం లెదర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లేబర్, పీఎఫ్ అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. చట్టాలను ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్ అహ్మద్ (అఫ్రోజ్), జన్ను స్వామి, కిరణ్, సన్నీ, చార్లీ, పాల్ ఉన్నారు.

### వంట సామగ్రి పంపిణీ



**హన్మకొండ చౌరస్తా :** హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ విపత్తు నిర్వహణ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం 10వ డివిజన్ పద్మాక్షికాలనీలోని ఆనంద నగర్ (లెప్రసీ కాలనీ)లో 60 నిరుపేద కుటుంబాలకు వంట సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ హనుమకొండ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

### కార్మికుల బోర్డు ఏర్పాటు చేయాలి

**హన్మకొండ అర్బన్ :** రవాణా రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా ఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ రంగంలో 20 లక్షల మంది ఉన్నారన్నారు. జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి, సారయ్య, రమేష్, సంపత్ ఉన్నారు.

# ముంపు బాధితులను ఆదుకుంటాం

● వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్

**హసన్‌పర్తి:** ఇటీవల కురిసిన భారీవర్షాలతో వరద ముంపునకు గురైన 56 డివిజన్ జవహార్ కాలనీలో మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ పర్యటించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలను పరామర్శిస్తూ నిత్యావసర వస్తువులు అందించారు. ఇంటింటికి వెళ్లి 650 మంది కుటుంబాలకు సరుకులు అందజేశారు. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జవహార్‌కాలనీ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మణీంధర్‌నాథ్, రవీందర్,



హసన్‌పర్తి: నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

**హన్మకొండ చౌరస్తా:** కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని 9వ డివిజన్‌లో నిరుపేద కుటుంబాలకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి 50 మంది వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

**మడికొండ:** కామారెడ్డి నిర్మల మోహన్ స్వచ్ఛంద సేవా సంస్థ వారు ముందుకు వచ్చిన డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రావుల శివకుమార్ సమక్షంలో రూ.35వేల విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎం.చుక్కయ్య, మల్లేశం, సాంబయ్య, రమేష్, సంటి రవి పాల్గొన్నారు.

**వరంగల్ చౌరస్తా :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని హంటర్‌రోడ్డులో ఎన్‌టీఆర్ నగర్, సంతోషిమాతకాలనీ, రామన్నపేటల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులకు బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ 150 మంది కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మాదాసు రాజు, ముంద్రాతి వెంకటేశ్వరు, చిలువేరు రాజేందర్, కందగట్ల మల్లికార్జున్, చంద్రమౌళి, గోవింద్ సింగ్, పాల్గొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిరువ్యాపారులకు ఓరుగల్లు ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో గజ్జల లింగమూర్తి, రమేష్, బాబు, జన్ను బాబు, మురళి, మంజు సుజాత లత తదితరులు పాల్గొన్నారు.

## మేయర్‌ను కలిసిన డిప్యూటీ కమిషనర్



**వరంగల్ అర్బన్ :** నగర మేయర్ గుండు సుధారాణిని ఇటీవల కాశిబుగ్గ డిప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సమర్థవంతంగా పారదర్శకంగా విధులను నిర్వర్తించాలని సూచించారు.

## ఆయుష్ వైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలి

● విశ్వ ఆయుర్వేద పరిషత్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ బాల్నె సాంబమూర్తి

**కాశిబుగ్గ :** అల్లోపతి వైద్య విద్యార్థులకు మాదిరిగా ఆయుష్ వైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని విశ్వ ఆయుర్వేద పరిషత్ జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ బాల్నె సాంబమూర్తి, జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు డిమాండ్ చేశారు. స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు విధులు బహిష్కరించి చేపట్టిన ధర్నా నాలుగో రోజుకు చేరుకుంది. మంగళవారం వారికి విశ్వ ఆయుర్వేద పరిషత్ వారితో పాటు పలువురు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 తెలంగాణ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు స్టైఫండ్ పెంచడం నమ్మశక్యంగా లేదన్నారు. అల్లోపతి విద్యార్థులకు పెంచడం వీరికి పెంచకపోవడం సవతితల్లి ప్రేమ మాదిరిగా ఉందన్నారు. ఈ ధర్నాలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్యశాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

## చేనేత కార్మికుల సంక్షేమమే ధ్యేయం

**రామన్నపేట :** చేనేత కార్మికుల సమస్యల సాధన దిశగా ముందుకు సాగిన నాయకులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి పేర్కొన్నారు. చేనేత మిత్ర పథకం ద్వారా ప్రతి మగ్గం కార్మికుడికి రూ. 3 వేల ఆర్థికసాయం అందించడానికి నిర్ణయం తీసుకున్న కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు మంగళవారం కొత్తవాడ జంక్షన్‌లో ఎమ్మెల్యే, మేయర్ క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్, నరేందర్, సత్యనారాయణ, చిప్ప వెంకటేశ్వరు నరేందర్ పాల్గొన్నారు.

## నీటి పారుదల సీఈ కార్యాలయం ఎదుట ధర్నా

**హసన్‌పర్తి:** చింతగట్టుక్యాంప్‌లోని నీటిపారుదల శాఖ వరంగల్ చీఫ్ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు మెగా కంపెనీ వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమైక్య రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి మాట్లాడుతూ ఈస్ట్ యూనియన్‌లో చేరిన నేతలను వివిధ ప్రాంతాలకు అక్రమంగా బదిలీలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ బదిలీలను రద్దు చేసి, యథాస్థానంలో నియమించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పనిభారాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని స్కూళ్లపై కమిటీ వేయాలి

విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయం వద్ద ధర్నా

**విద్యారణ్యపురి :** పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలో వరంగల్, కరీంనగర్ జిల్లాలో ఉన్న విద్యాధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ అలాగే అనుమతి లేని స్కూళ్లపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హనుమకొండ పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట భారత ఐక్యవిద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున నిరసన నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డికి అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాల వివరాలు, అవినీతికి పాల్పడుతున్న విద్యాధికారులపై విచారణ జరపాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూఎస్ ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో అనుమతి లేకుండా పలు విద్యాసంస్థలు నడుస్తున్నప్పటికీ ఎలాంటి విచారణ జరపకుండా జిల్లా విద్యాధికారులు యజమానులకు కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాలోత్ రాజేష్ నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలకూరి హరీష్, నాయకులు యశ్వంత్ రాకేష్, ప్రశాంత్, బన్నీ, సంజయ్ పాల్గొన్నారు.

# ఆర్గానిక్ ఫార్మింగ్‌తో ఆరోగ్య సమాజం

**కేయూ క్యాంపస్:** ఆర్గానిక్ ఫార్మింగ్‌తో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం అవుతుందని కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్ అన్నారు. కేయూలోని మైక్రోబయాలజీ విభాగంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ట్రైనింగ్ ఫర్ ఎక్స్‌టెన్షన్ స్టాఫ్ ఆన్ ఆర్గానిక్ అండ్ న్యాచురల్ ఫార్మింగ్ అంశంపై వర్క్‌షాప్ కొనసాగింది. మంగళవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతోపాటుగా ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందన్నారు. సైన్స్ విభాగాల డీన్ ఆచార్య పి.మల్లారెడ్డి మాట్లాడుతూ ఆర్గానిక్ ఫార్మింగ్ సామాజిక బాధ్యత అన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు వ్యవసాయం రంగంలోని వారికి తెలియజేస్తే ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సభకు మైక్రోబయాలజీ విభాగం అధిపతి శ్రీనివాస్ ముంజం అధ్యక్షత వహించారు. సమావేశంలో కో–ఆర్డినేటర్ ప్రవీణ్, అధ్యాపకులు డాక్టర్ కె.సుజాత, డాక్టర్ పి.వెంకటయ్య, అడ్జెంట్ ఆచార్యులు ఎస్ రాంరెడ్డి, డాక్టర్ సూర్యం, డాక్టర్ బి.వెంకటగోపినాథ్, డాక్టర్ నర్సింహారావు తదితరలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌లాల్

# బిల్లులు ఇస్తాం.. పనులు చేపట్టండి



కాంట్రాక్టర్లతో సమావేశమైన ఎస్ఈ కృష్ణారావు

**వరంగల్ అర్బన్ :** అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు అందజేస్తామని మహానగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎస్ఈ కృష్ణారావులు కాంట్రాక్టర్లను సూచించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్‌తో కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు భేటీ కాగా, కమిషనర్ హైదరాబాద్ నుంచి మొబైల్ ఫోన్‌లో ప్రతినిధులు మాట్లాడారు. ఎస్ఈ కృష్ణారావు బల్దియా కౌన్సిల్ హాల్‌లో సమావేశమై కాంట్రాక్టర్ల సమస్యలు, పేరుకపోయిన బిల్లుల పెండింగ్‌పై చర్చించారు. ప్రభుత్వం రూ. 250కోట్ల నిధులను మంజూరీ చేసిందని, రెండు రోజుల్లోగా బిల్లుల చెల్లింపులు మొదలవుతాయని, పనులు కొనసాగించాలని, సమ్మెను విరమించుకోవాలని కోరారు. అందుకు కాంట్రాక్టర్లు కూడా అంగీకరించారు. బిల్లులు ఇవ్వకపోతే మళ్లీ పనులు నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు.

# ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలి

**రామన్నపేట :** వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 25వ డివిజన్ మొగిలయ్య హాల్ సమీపంలో ఆకస్మికంగా పర్యటించి నల్లాల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. నగరంలో ఎక్కడైనా పైపులైన్ లీకేజీలు ఉత్పన్నమైనట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే వాటిని అరికట్టాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు శిరీష శ్రీమాన్, ఏఈ హబీ బొద్దీన్, ఇన్‌స్పెక్టర్‌లు అశోక్, నాగరాజు, నర్సింగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ మృతి సమాజానికి తీరని లోటు

**కేయూ క్యాంపస్ :** విప్లవ కెరటం ప్రజాయుద్ధ నౌక గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటు అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కాత్యాయనీ విద్మహే అన్నారు. యూనివర్సిటీలో తెలుగు విభాగంలో మంగళవారం తెలుగు విభాగం అధిపతి ఆచార్య బన్న అయిలయ్య ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**కొవ్వొత్తులతో నివాళి**


**హన్మకొండ:** ప్రజా గాయకుడు గద్దర్‌కు హనుమాన్ నగర్‌లో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మంగళవారం హనుమకొండ హనుమాన్ నగర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్ల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కాలనీ వాసులు కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు.

**న్యూశాయంపేట :** ప్రజానౌక గద్దర్, సియాసత్ పత్రిక ఎడిటర్ జహీర్ అలీఖాన్‌ల మృతి తెలుగు ప్రజానీకానికి తీరని లోటని వక్తలు అన్నారు. మంగళవారం హనమకొండ అంబేడ్కర్ సెంటర్‌లో గద్దర్, జహీరుద్దీన్‌అలీఖాన్‌ల సంస్మరణ సభ జరిగింది. భారత్ బచావో అడ్వయిజరీ కమిటీ సభ్యులు డాక్టర్ రాజ్‌మహ్మద్ సారథ్యంలో నివాళులర్పించారు.

**వరంగల్ లీగల్:** ప్రజాయుద్ధనౌక గద్దర్ మృతి యావత్ పేద ప్రజానికి తీరని లోటు అంటూ మంగళవారం రాత్రి వరంగల్ జిల్లా న్యాయవాదుల సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో అదాలత్ నుంచి అమరవీరుల స్తూపం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

# ఎంఆర్ఐ సేవలు ప్రారంభించాలి

**ఎంజీఎం :** ఎంజీఎం ఆస్పత్రిలో ఎంఆర్ఐ సేవలు నిలిచిపోయి నెలలు గడుస్తున్నాయని, ఆస్పత్రికి పరికరం చేరుకుని రెండు నెలలు గడుస్తున్నా సేవలు అందుబాటులోకి రావడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగరాపు బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆస్పత్రిలోని సమస్యలపై సర్వే నిర్వహించి ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో చాలా రక్తపరీక్షలు బయట కేంద్రాల్లో చేయించుకోమంటున్నారని, ఆస్పతిలో స్ట్రెచర్లు సైతం సరిగ్గా పనిచేయడం లేదన్నారు. ఆస్పత్రిలోని ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆరూరి కుమార్, రమేశ్, శివ, విజయ్‌కుమార్, చారి, తదితరులు పాల్గొన్నారు.



ఎంజీఎం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

## సంక్షిప్త వార్తలు

**గడువు పొడిగించాలి**

**వరంగల్ అర్బన్/ఖిలావరంగల్:** గృహలక్ష్మి దరఖాస్తుల స్వీకరణకు గడువు తేదీని పొడిగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, అఖిల భారత మహాత్మాజ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కేడల ప్రసాద్ డిమాండ్ చేశారు. కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తు చేసుకుంటున్న వారి ఇబ్బందులు మంగళవారం అడిగి తెలుసుకున్నారు.

**పాఠశాలను సీజ్ చేయాలి**

**హసన్‌పర్తి :** అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ఇండియన్ హైస్కూల్(డే) పాఠశాలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం ఎంఈఓ రామకృష్ణరాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ మాట్లాడారు.

**సమస్యలు పట్టించుకోరా..**

**కాశిబుగ్గ :** బీజేపీ నాయకులు, కార్యకర్తల ఇళ్ల ముందు సమస్యలు పట్టించుకోరా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాశిబుగ్గ తిలక్‌రోడ్డులో రెండు నెలలుగా రోడ్డును తవ్వి వదిలేసిన ప్రాంతాన్ని స్థానిక నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఆయన వెంట బీజేపీ నేతలు ఉన్నారు.

**ధర్నాను విజయవంతం చేయాలి**

**విద్యారణ్యపురి:** ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై ఈనెల 12న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని హనుమకొండ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ జిల్లా స్టీరింగ్ కమిటీ పిలుపునిచ్చింది. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న దశలవారి పోరాట కార్యక్రమంలో భాగంగా ధర్నా, ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మేకల సదాశివరెడ్డి, కట్కూరి శ్రీనివాస్, ఎంఏ బాసిత్ జి.ఉప్పలయ్య, పాల్గొన్నారు.

**ఏఎన్ఎంలను రెగ్యులరైజేషన్ చేయాలి**



**వరంగల్ చౌరస్తా :** సీఎం కేసీఆర్‌కు రెండో ఏఎన్ఎంలను రెగ్యులరైజేషన్ చేయాలని వరంగల్ హెడ్ పోస్టాఫీస్ ఆఫీసులో వ్యక్తిగతంగా పోస్టుకార్డులు రాశారు. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్డులు మంగళవారం పోస్టు చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ ఈనెల 10న కలెక్టర్ కార్యాలయం ఎదుట జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని డిమాండ్ చేశారు.

**చలో హైదరాబాద్‌కు సహకరించాలి**

**ఎంజీఎం :** పాత పెన్షన్ సాధన కోసం ఈ నెల 12న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి సహకరించాలని మంగళవారం ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు ఉద్యోగ సంఘాల నేతలు విన్నవించారు. ఈ సందర్భంగా నర్సింగ్ వింగ్ అధ్యక్షురాలు ప్రేమలత మాట్లాడారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఎంజీఎంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి అనుమతినివ్వాలని కోరారు.

**పద్యనాటక కళాకారులకు అభినందనలు**



**హన్మకొండ కల్చరల్ :** ఇటీవల తిరుపతిలో జరిగిన జాతీయస్థాయి పద్యనాటక పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన విజయానిరుద్ధం పద్యనాటకం పాత్రదారులు అవార్డులు అందుకున్నారు. మంగళవారం హనుమకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాపరిషత్ అధ్యక్షుడు దేవరాజు రవీంద్రరావు, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి రమేష్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో అవార్డులు లభించడం ఆనందదాయకమని అన్నారు.

**ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య**

**రామన్నపేట :** తన భార్య తనను విడిచి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురై ఎల్బీనగర్‌కు చెందిన షేక్ అమీర్(35) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మట్టెవాడ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అమీర్‌కు 22 నెలల క్రితం హైదరాబాద్‌కు చెందిన హజీరా బేగంతో వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య చిన్నచిన్న సమస్యలు తలెత్తడంతో హజీరా బేగం హైదరాబాద్‌లోని మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అమీర్ భార్య హజీరా బేగంకు ఫోన్ చేసిన సందర్భంలో ఆమె మాట్లాడకుండా వారి కుటుంబ సభ్యులతో మాట్లాడించడంతో మనస్తాపానికి మధ్యాహ్నం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరి పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**వ్యక్తిపై సైకో దాడి**

**రామన్నపేట :** వరంగల్ నగరంలోని వేణుగోపాల్ రావు కాలనీలోని నాగరాజు అనే వ్యాపారిపై మంగళవారం సాయంత్రం ఓ సైకో దాడికి దిగాడు. తన కుమార్తె ఐశ్వర్యపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి(సైకో)ని నాగరాజు మందలించడంతో రాళ్లతో దాడికి దిగాడు. స్థానికులు సైతం అడ్డుకునేందుకు ప్రయత్నించగా వారిపై సైతం దాడికి దిగడానికి ప్రయత్నించాడు. 100 కాల్ చేయగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకునేలా లోపు పరారయ్యాడు. ఈ ఘటపై బాధితుడు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు

**పశువులకు టీకాలు వేయించాలి**

**ఖిలా వరంగల్:** పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని ఖిలా వరంగల్ పశువైద్యశాల డాక్టర్ మాళవిక, కార్పొరేటర్ బైరబోయిన ఉమ దామోదర్‌యాదవ్ సూచించారు. మంగళవారం పడమరకోటలో గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.

**స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు**

**హన్మకొండ అర్బన్:** ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ వీఐపీలు, అతిథులు, పిల్లలకు ఇబ్బందులు లేకుండా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు.

**చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి**

**కరీమాబాద్:** ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలు, పానీయాలు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు శ్రీలత అన్నారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం సఖి సేవలు, బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ మీడియాతో అనార్థాలు ఎక్కువగా ఎదురవుతున్న నేపథ్యంలో వాటికి దూరంగా ఉండాలని సూచించారు.

**యూత్ హాస్టల్‌లోకి తహసీల్ కార్యాలయం**

**హన్మకొండ అర్బన్ :** పలు మార్లు వరద, బురద, వర్షంతో కార్యాలయంలో సామాగ్రి ఫైల్స్ తడిసిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు మేలుకున్నారు. ఎట్టకేలకు అంబేడ్కర్ భవన్ ఎదుట ఉన్న తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం హనుమకొండ బస్టాండ్ సమీపంలోని యూత్ హాస్టల్‌కు తరలించారు. అధికారులు సిబ్బంది సామగ్రి మొత్తం యూత్ హాస్టల్‌కు తరలించారు. అక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తామని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

**చెక్కుల పంపిణీ**

**మడికొండ:** గ్రేటర్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండకు చెందిన సపురా హమీద్, వేముల సుగుణకు సీఎంఆర్ఎఫ్ నుంచి వచ్చిన రూ.3లక్షల చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రశాంత్‌నగర్‌లోని తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ సరోజన, కరుణాకర్, దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**మనసున్న మహనీయుడు సీఎం కేసీఆర్**

**ఖిలా వరంగల్:** మనసున్న మహనీయుడు సీఎం కేసీఆర్ అని, అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని చూసుకునేది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్ పెంపు, డీలర్లకు హెల్త్‌కార్డు, కరోనా సమయంలో చనిపోయిన డీలర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడంపై డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మండల రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు మర్యాపూర్వంగా కలిశారు. కలిసిన వారిలో మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు మంద భారతి, రామచంద్రం, శంకర్, పూర్ణచందర్, అమర్‌వర్మ ఉన్నారు.

**పరామర్శ**

**కాశిబుగ్గ :** కాశిబుగ్గకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు పరమేశ్వర్ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చా డు. బీ జేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మంగళవారం పరమేశ్వర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.

**శాంతిభద్రతలపై ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక దృష్టి**

**ఖిలా వరంగల్:** ఇటీవల బాధ్యతలు చేపట్టిన మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. అల్లర్లకు అడ్డాగా మారిన వరంగల్ శంభునిపేటలో మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. పలువురి ఆకతాయిలకు తమదైన శైలిలో కోటింగ్ ఇచ్చారు. శంభునిపేటలో షాపుల ఎదుట రాత్రి 10 గంటలకే ఆకతాయిలు తిష్టవేసి అల్లర్లు, గొడవలు, దాడులకు దిగుతుండడంతో షాపు యజమానులకు ఇన్‌స్పెక్టర్ హెచ్చరికలు జారీ చేశారు.

## ముదిరాజ్ మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమేష్



**ఖిలావరంగల్:** తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తూర్పుకోటకు చెందిన ఇంద్రసేనా మెమోరియల్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా చైర్మన్ సంగరబోయిన ఉమేష్ నియమితులయ్యారు. మంగళవారం తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండా ప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, నగర అధ్యక్షుడు బయ్యస్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్ చేతుల మీదుగా ఉమేష్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉమేష్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల సంక్షేమానికి పాటుపడుతానని, మహాసభ బలోపేతానికి మరింతగా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన డాక్టర్ బండా ప్రకాశ్, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ఉమేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.